# పీఎంఏజేఏవై పథకం స్వయం ఉపాధి యూనిట్ల ప్రారంభించిన ఎమ్మెల్యే పార్థసారధి





### లబ్ధిదారులకు అండగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

**ఆదోని,జూలై01.అక్షర టైమ్స్:–** ఆదోని మండలం దానపురం గ్రామం వెలుగు ( సెర్ప్ ) శాఖ ఆధ్వర్యంలో సెర్ప-ఉన్నతి-పి ఎం ఏ జె ఏ వై -- ఏపీఎస్ సి సి ఎఫ్ సి లిమిటెడ్. 2026-27 కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన ( పిఎంఏ జేఏవై ) కింద మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లను ఆదోని ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకం ద్వారా ఎంపికైన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన టైలరింగ్ షాప్ మరియు టిఫిన్ సెంటర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం టైలరింగ్ మిషన్‌ను ప్రారంభించి, టిఫిన్ సెంటర్‌లో స్వయంగా టీ తయారు చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద కుటుంబాలు, మహిళలు, యువత స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ, ఉపాధి పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు తమ వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించి, మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పీఎంఏజేఏవై వంటి పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాకుండా, లబ్ధిదారులు శాశ్వత జీవనోపాధిని పొందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వీరన్న, క్లస్టర్ సీసీలు, అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# పునర్విభజన సమస్యలను పరిష్కరించాలి ఆర్జేడి కి యుటిఎఫ్ వినతి



**బద్వేల్,జులై01.అక్షర టైమ్స్:–**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లాల పునర్విభజన సందర్భంగా జిల్లాలకు ఉద్యోగ, ఉపాధ్యాయుల కేటాయింపులో నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జాబీర్, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కె.శామ్యూల్, జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ కు విజ్ఞప్తి చేశారు.బుధవారం సాయంత్రం కడపలోని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల వారి కార్యాలయంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో యుటిఎఫ్ పక్షాన జిల్లాల పునర్విభజన పై పలు సమస్యలను ప్రస్తావిస్తూ ప్రాతినిధ్యం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన కారణంగా కడప, మరియు అన్నమయ్య జిల్లాలుగా విభజించినందున ఉపాధ్యాయులను ఆయా జిల్లాలకు విభజించే సందర్భంలో పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తూ పునర్విజనలో ముందుకు సాగాలన్నారు. అన్ని రకాల యాజమాన్యాలలోని గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయ పోస్టులను జోనల్ పోస్టులుగా ఆర్గనైజ్ చేయాలని కోరారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య, ఉన్నత విద్యా విభాగాలను 1975 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ గా చూపాలన్నారు. జిల్లాలలోని ఉపాధ్యాయ ఖాళీలను జనాభా ఆధారంగా విభజించాలని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను పోస్టులను బట్టి రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తింపజేయాలని కోరారు. మహిళా ఉద్యోగులు 33 శాతం రిజర్వేషన్ కూడా ఉద్యోగుల కేటాయింపులో పరిగణలోకి తీసుకొని కేటాయింపులు చేపట్టాలన్నారు. ఉద్యోగుల కేటాయింపులో వయసు మరియు అనుభవాన్ని సమతుల్యం చేసేందుకు ఫీడర్ కేటగిరి సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలన్నారు. అంతర్ జిల్లా బదిలీలు, ఎయిడెడ్ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయుల మొత్తం సర్వీసును కేటాయింపులలో పరిగణలోనికి తీసుకోవాలని, ఉద్యోగులకు ప్రాధాన్యత ఇచ్చే విషయంలో మానసిక వైకల్యం కలిగిన పిల్లల తల్లిదండ్రులతో పాటు, జువైనల్ డయాబెటిస్ ఉన్న పిల్లల తల్లిదండ్రులను, మానసిక వైకల్యం కలిగిన స్పౌజ్ ను ప్రాధాన్యత కేటగిరీ కింద తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 28 జిల్లాలుగా పునర్వవిజన చేసిన సందర్భంలో కడప, అన్నమయ్య, మరియు తిరుపతి జిల్లాలలో కొన్ని మండలాలను విలీనం చేసినందువల్ల ఆ విలీన ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగుల విభజన ప్రక్రియ జరిగే ముందు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన అంతర్ జిల్లా బదిలీలను చేపట్టాలని, ఫిజికల్ డైరెక్టర్, పిఎస్ హెచ్ఎం ఎగైనెస్ట్ పోస్టులలో పనిచేస్తున్న భాషోపాధ్యాయులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు నష్టం జరగకుండా పోస్టుల విభజన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# స్టీల్ ప్లాంట్ మళ్ళీ ప్రారంభించడం సిగ్గుచేటు : ఎమ్మెల్యే డా"దాసరి సుధ

**బద్వేల్,జూలై01.అక్షర టైమ్స్:–** గత వైయస్ఆర్సిపి ప్రభుత్వం లో మా నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు 2022 వ సంవత్సరం లో 8600 కోట్లతో శంకుస్థాపన చేసి 3 ఎంపీటీఏ ఉత్పత్తి సామర్థ్యం ఉండేలా జె.ఎస్.డబ్ల్యూ కంపెనీ తో ఒప్పందం కూడా చేసుకోవడం జరిగింది.కానీ ఇప్పుడు మళ్ళీ చంద్రబాబు నాయుడు ఎల్లుండి వచ్చి ప్రారంభించడం చాలా విడ్డూరంగా ఉంది అని తెలిపారు.వాస్తవాలను ప్రజలకు తెలియచేసేందుకు నేరుగా వై.యస్.ఆర్.సి పార్టీ ఆధ్వర్యం లో కడప జిల్లా కు సంబంధించిన ముఖ్య నాయకులు అందరూ స్టీల్ ప్లాంట్ ప్రదేశానికి వెళ్తుండగా మార్గ మధ్యలో పోలీస్ వారు అడ్డుకోవడం దుర్మార్గం అని తెలిపారు ఈ స్టీల్ ప్లాంట్ క్రెడిట్ ఎక్కడ మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందో అని మళ్ళీ చంద్రబాబు నాయుడు ప్రారంభించిన దానిని మళ్ళీ ప్రారంభించడానికి జిల్లా కు రావడాన్ని మా పార్టీ తరుపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.పూర్తిగా ప్రజలను డైవర్ట్ చేయడానికి చేస్తున్న డ్రామా అని తెలిపారు. ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీ రవీంద్ర నాథ్ రెడ్డి,పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచమల్లు ప్రసాద్ రెడ్డి,ఎమ్మెల్సీ లు గోవింద రెడ్డి ,రామ సుబ్బారెడ్డి,రామచంద్రా రెడ్డి,మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా,మాజీ మంత్రి శైలజానాథ్,మాజీ ఎమ్మెల్యే రఘు రామ్ రెడ్డి,బద్వేల్ నియోజక వర్గ పరిశీలకులు మల్లికార్జున రెడ్డి ఇతర ముఖ్యమైన నాయకులు పాల్గొన్నారు.



# వైద్యుల దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

### జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరం ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

### నంద్యాల వైద్యుల సేవలు అభినందనీయం: జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి.ఫిరోజ్

### వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులు ప్రజల సేవ కోసం పునరంకితం కావాలి: డాక్టర్ రవి కృష్ణ





నంద్యాల,జులై01.అక్షర టైమ్స్:– స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న,పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బి.సి రాయి జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించే జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని మరియు నంద్యాల ప్రథమ ఈఎన్టీ వైద్యులు దివంగత డాక్టర్ సత్యనారాయణ జ్ఞాపకార్థం, నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఎ సహకారంతో తిరుమల పునీత్ ఈ ఎన్ టి మరియు స్కిన్ ఆసుపత్రి నిర్వహణలో, రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు పి 4 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉచిత చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ డాక్టర్ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ., నంద్యాల వైద్యులు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ,దివ్యాంగులకు, దేశ రక్షణలో పనిచేస్తున్న త్రివిధ దళాల ఉద్యోగుల కుటుంబాలకు ఉచిత ఓ పి డి సేవలు అందిస్తూ రాష్ట్రంలోని వైద్యులకు ఆదర్శప్రాయంగా నిలిచారని అభినందించారు. ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ వైద్య సేవలే కాకుండా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో వైద్యులు ముందు ఉండడం ప్రశంసనీయమన్నారు. వైద్యుల దినోత్సవం వేడుకలలో భాగంగా ఫిరోజ్ కేక్ కట్ చేసి వైద్యులకు అందించారు.ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర మాజీ ఐఎంఏ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులందరూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా తిరుమల పునీత్ ఈఎన్టి స్కిన్ ఆసుపత్రి తరపున డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ భార్గవర్ధన రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ విజయబాబు, నంద్యాల మహిళా వైద్యుల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, వెలాసిటీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ లకు వైద్యుల దినోత్సవ పురస్కారాలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందించి సత్కరించారు.వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యురాలైన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని నంద్యాల ఐఎంఏ మహిళా వైద్యులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ కల్లూరి రామలింగారెడ్డి, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ నాగమణి,డాక్టర్ నర్మద, డాక్టర్ లలిత, ప్రజలు పాల్గొన్నారు.

**విజయవంతమైన వైద్య శిబిరం:**

ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ చెవి ముక్కు గొంతు వైద్యులు ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ అనిల్ కుమార్,ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ హరిత దాదాపు 300 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా లక్ష రూపాయలు విలువచేసే మందులు పంపిణీ చేశారు. 70 మందికి అవసరమైన వినికిడి పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించడం జరిగింది.

# ప్రజల మధ్య సేవ అభిమానుల మధ్య పుట్టినరోజు వేడుక: గుడిసె ఆది కృష్ణమ్మ

### పట్టణ,గ్రామీణ ప్రాంతాల అభిమానుల సమక్షంలో జన్మదిన వేడుకలు..





**ఆదోని,జూలై01.అక్షర టైమ్స్:–** రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన గుడిసి ఆది కృష్ణమ్మ తన పుట్టినరోజు సందర్భంగా ప్రజాసేవకే తొలి ప్రాధాన్యం ఇచ్చారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడం తన తొలి బాధ్యత అని తెలిపారు. సమాజమే నా దేవాలయం.. సమాజసేవే నా ధ్యేయం. ముందుప్రజలకు సేవ చేయడం ఆ తర్వాతే నా పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటాను అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం సేవ చేస్తానని ఆమె స్పష్టం చేశారు. ఆమె వ్యాఖ్యలను స్థానికులు, పార్టీ నాయకులు అభినందించారు. అనంతరం తన క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు స్వీకరించిన గుడిసిఆది కృష్ణమ్మ తనపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రజాసేవను మరింత అంకితభావంతో కొనసాగిస్తానని హామీ ఇచ్చారు... శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారి రాకతో పరిసర ప్రాంతమంతా జనసంద్రంగా మారింది. పూలమాలలు, శాలువాలతో ఘన సన్మానం చేయడంతో పాటు కేక్ కటింగ్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నెలకొంది . "హ్యాపీ బర్త్‌డే ఆది కృష్ణమ్మ అక్క" అంటూ కార్యకర్తలు నినాదాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి గుడిసిఆది కృష్ణమ్మ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆమెకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని భవిష్యత్తులో రాజకీయంగా ఇంకా పైకి ఎదగాలని మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఆమె నివాసం సందర్శకులతో కిక్కిరిసిపోయి పండుగ వాతావరణాన్ని తలపించింది.




# పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్,జులై01.అక్షర టైమ్స్:–** బద్వేలు పట్టణంలోని 1వ వార్డు అగ్రహారంలో కుప్పయ్య ఆధ్వర్యంలో పెన్షన్ ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆయన చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయబడింది. కార్యక్రమం అనంతరం డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా భారీ కేక్ కటింగ్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జహంగీర్ ఆధ్వర్యంలో ఘనంగా సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు





**బద్వేల్,జులై01.అక్షర టైమ్స్:–** తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్ భాష ఆధ్వర్యంలో డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు బద్వేల్ పట్టణంలోని ఎన్జీవో కాలనీలోని సూర్యనారాయణ రెడ్డి ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు.20 కిలోల కేకు కట్ చేసి గజమాల తో సూర్యనారాయణ రెడ్డి ని సత్కరించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి భవిష్యత్తు లో మరెన్నో పదవులు పొంది ఆయురారోగ్యాలతో ఉండాలని , మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం సీమాంక్ హాస్పిటల్ లోని రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు.తనకు శుభాకాంక్షలు చెప్పి ఆశీర్వదించడానికి వచ్చిన అందరితో సూర్యనారాయణ రెడ్డి ఆప్యాయంగా పలుకరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,సూర్యనారాయణ రెడ్డి అభిమానులు, జహంగీర్ యువసేన సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# బనగానపల్లెలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన



**బనగానపల్లె,జులై01.అక్షర టైమ్స్:–** నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేపథ్యంలో ఆర్ ఱ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షోరాణ్ లతో కలిసి మంత్రి బనగానపల్లెలో క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేశారు.. అనంతరం సీఎం పర్యటనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన భద్రత చర్యలు, ఏర్పాట్లపై బనగానపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ బహిరంగ సభకు అనువైన స్థలాన్ని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షోరాణ్ కలిసి స్వయంగా పరిశీలించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేని విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,ప్రజానీకానికి అనుగుణంగా భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగంతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రి ,జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ముస్లిం కమ్యూనిటీ భవనానికి రూ.50 వేల విరాళం

### ఎన్నికల హామీ నెరవేర్చిన మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి




**ఆదోని,జూలై01.అక్షర టైమ్స్:–** ఆదోని మండలం పాండవగల్లు గ్రామం ముస్లిం కమ్యూనిటీ భవనం (శాదిఖానా) రేకుల షెడ్డు నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి గురువారం రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ విరాళాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ సహకరిస్తానని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అందించిన విరాళంపై గ్రామ ముస్లిం పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హుస్సేన్ భాషా, అహ్మద్ భాషా, దివాన్ భాషా, బడేసాబ్, మా భాషా, ఖాదర్ భాషా, నజీర్ అహ్మద్, అనీఫ్ బాషా, నూర్ అహ్మద్, మహమ్మద్ రజాక్, గ్రామ వైసీపీ నాయకులు రాములు, తిక్కయ్య, హనుమంతరెడ్డి, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

## పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్‌గా తుడిమెళ్ల మురళి కృష్ణకు సన్మానం

**జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా**

**అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభినందనలు**




**కడప,జూలై01.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన బద్వేల్ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు తుడిమెళ్ల మురళి కృష్ణను జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు, కడప అసెంబ్లీ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కడపలోని జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుంకర శ్రీనివాస్ ఆ పార్టీ నాయకులతో కలిసి తుడిమెళ్ల మురళి కృష్ణకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ ప్రజా సేవలో ఉన్న తుడిమెళ్ల మురళి కృష్ణకు కీలక బాధ్యత దక్కడం సంతోషకరమన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ పత్తి విశ్వనాథ్, కడప నగర అధ్యక్షుడు బోరెడ్డి నాగేంద్ర, బద్వేల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విబి జీ రామ్ జీ తో వికసిత్ భారత్ కి బలమైన పునాది "

**నారిశెట్టి నాగేంద్ర పోరుమామిళ్ల మండల బీజేపీ అధ్యక్షుడు**

**1 జూలై 2026 నుండి ఉపాధి హామీ అవకతవకలకు చెక్ - నాణ్యమైన గ్రామీణ ఆస్తుల కల్పన లక్ష్యంగా విబి జీరాంజీ అమలు**



**పోరుమామిళ్ల,జూలై01.అక్షర టైమ్స్:-** తిరుపతి జిల్లాలోని ముక్కవారి పల్లె గ్రామం నుండి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతులమీదుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో జరగనుండడం చారిత్రాత్మకం.మన రాష్ట్రానికి దేశంలో రెండవ అత్యధిక నిధులు రూ. 7,700 కోట్లు సాధించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వాటా 5500 కోట్లు కలుపుకొని 13 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తుల కల్పనకు ఈ సంవత్సరం అవకాశం కలుగుతుంది. ఇంత పెద్ద ఎత్తున నిధులు రాష్ట్రానికి ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ జీకి ధన్యవాదాలు. ఉపాధి హామీ పథకాన్ని పునర్వ్యవస్థీకరించే దిశగా చేపట్టిన సంస్కరణలు నేటి పరిస్థితులకు అనుగుణంగా సత్ఫలితాలు రాబట్టడానికి అవసరమైన సంస్కరణ విబి జీరాంజీ . ముఖ్యంగా " వికాసిత్ భారత్ రోజ్‌గార్ మరియు ఆజీవిక హామీ మిషన్ (గ్రామీణ) (వీబీ-జీ- రామ్ జీ) , 2025" గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కల్పనతో పాటు నాణ్యమైన ఆస్తుల సృష్టికి దోహదపడే విధంగా, నిధుల దుర్వినియోగాన్ని నివారిస్తూ, ఉన్నతమైన లక్ష్యంతో మరియు పారదర్శకంగా నిధులు వినియోగించే ఉద్దేశ్యంతో చేసిన చట్టం. నేటి కాలమాన పరిస్థితులకు తగిన విధంగా ప్రభుత్వం నిధుల వినియోగంలో జవాబుదారీతనం పెంచే విధంగా " వీబీ - జీ రామ్ జీ ( వికాసిత్ భారత్ - గారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ) " చట్టం తయారు చేయడం జరిగింది. గ్రామ స్వరాజ్యంతో గ్రామాలు శ్రీరామ రాజ్యంలా అభివృద్ధి చెందాలనే మంచి ఉద్దేశ్యంతో తయారు చేసిన చట్టం ఇది.

## 20 సూత్రాలతో జీవన ప్రమాణాలు మెరుగు

**తులసిరెడ్డిని ఘనంగా సత్కరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**వేంపల్లె,జూలై01.అక్షర టైమ్స్:-** దారిద్ర్య నిర్మూలన, సామాన్య మానవుని జీవన ప్రమాణాల పెంపు అనే ద్విముఖ లక్ష్యాలతో 1975 జులై 1న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రారంభించారని, చాలా మేరకు దారిద్ర్యం నిర్మూలించబడి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. బుధవారం 20వ సూత్రాల ఆర్థిక కార్యక్రమ దినోత్సవం సందర్భంగా డా.తులసిరెడ్డి ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. 20 సూత్రాల ఛైర్మన్ గా తులసిరెడ్డి ఉన్నపుడు వరుసగా మూడేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జాతీయ స్థాయి ప్రథమ స్థానంలో నిలిచింది. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం దేశానికి, రాష్ట్రానికి ఎంతో అవసరమని, దీనిని సమర్థవంతంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ ఇంచార్జీ ధృవకుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, నాని తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాల అమలు,పింఛన్లు పంపిణీ

**టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర**



**వేంపల్లె,జూలై01.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలోని గాజులపేట, రెడ్డయ్య కాలనీ, ప్రియా తోటలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుపులేటి వీరభద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రూ.3 వేలుగా ఉన్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి అందుతున్న పింఛన్ చంద్రన్న సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు.

# నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక కార్పొరేట్ వైద్యం లక్ష్యం

**నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో క్రిటికల్ కేర్ వైద్యం అందుబాటులోకి తెస్తాం**

**వైద్య వృత్తి దైవంతో సమానం**

**ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం**







**నంద్యాల.,జులై01.అక్షర టైమ్స్:-** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఉమ్మడి ప్రభుత్వం వైద్యం కోసం అధిక నిధులు వెచ్చించి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం కూడా వైద్య సేవలకు నిధుల కొరత లేకుండా చూస్తుందని, నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అత్యవసర, క్రిటికల్ కేర్ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నంద్యాల జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు ఆధునిక, కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ నిధులు రూ. 50 లక్షలతో ఆధునిక పరికరాల ప్రారంభం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి ఒక్క ఆధునిక పరికరం ఇవ్వలేదని, నిర్లక్ష్యంకు గురైందని, వెనుకబడ్డ ఆసుపత్రికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఎక్కువ నిధులు తెచ్చి ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పని చేస్తున్నాం అన్నారు. నంద్యాల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో , గెయిల్ ఇండియా లిమిటెడ్,(జూ=) నిధులు, నంద్యాల ఎంపీ నిధులు రూ. 50 లక్షలతో మిత్ర సంస్థ సహకారంతో నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అత్యాధునిక వైద్య పరికరాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ గానే, కాకుండా ఒక డాక్టర్ గా నా జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. డాక్టర్లు కూడా కుటుంబాలను త్యాగం చేసి రోగికి మంచి వైద్యం అందించి క్లిష్ట సమయంలో కూడా రోగిని బ్రతికించేందుకే శ్రమిస్తారన్నారు. ఎక్కడైనా చిన్న పొరపాటు జరిగితే డాక్టర్ నిర్లక్ష్యం అని దాడులు చేయడం సరికాదన్నారు. వైద్య వృత్తి దైవంతో సమానం అన్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా భారీ కేక్ ను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కట్ చేశారు. భారత రత్న డాక్టర్ బిదాన్ చంద్ర రాయ్ (డాక్టర్ బి సి రాయ్ ) జయంతి, వర్ధంతిని జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ప్రతి డాక్టర్ అంకిత భావంతో పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ జిలాని, డిప్యూటీ సూపరెంటెండెంట్ డాక్టర్ చిట్టిబాబు, గైనకాలజిస్టు హెచ్ ఓ డి డాక్టర్. పద్మజా, డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ క్రిస్టోఫర్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి. విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్ నగరవనం ప్రారంభం





**బద్వేల్,జులై01.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణ ప్రజలకు ప్రకృతి సోయగాలను చేరువ చేస్తూ అభివృద్ధి చేసిన బద్వేల్ నగరవనం బుధవారం ఘనంగా ప్రారంభించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీవో చంద్రమోహన్ , డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి , వైఎస్సార్ జిల్లా అటవీ అధికారి డి.యఫ్.ఓ రాజశేఖర్ బాబు లు హాజరై నగరవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు నగరవనాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నగరవనాన్ని సందర్శించి ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు మొక్కలను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**బద్వేల్ నగరవనంలో ప్రత్యేక ఆకర్షణలు:**

సందర్శకుల కోసం ఆధునిక క్యాంటీన్
స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్.ఓ. వాటర్ సౌకర్యం
ఔషధ మొక్కలతో అభివృద్ధి చేసిన ఋషివనం
జ్యోతిష్య ప్రాధాన్యతతో రూపొందించిన నక్షత్రవనం
చిన్నారుల కోసం ఆకర్షణీయమైన చిల్డ్రన్స్ ప్లే జోన్
విశాలమైన పచ్చిక బయళ్లు (లాన్స్)
వివిధ వన్యప్రాణుల ప్రతిరూపాలతో వైల్డ్‌లైఫ్ పార్క్
సందర్శకులు విశ్రాంతి తీసుకునేందుకు అందమైన పగోడాలు
ప్రకృతి మధ్య నడకను ఆస్వాదించే ట్రెక్కింగ్ ట్రాక్
వివిధ రకాల మొక్కలతో కూడిన నర్సరీ
ప్రకృతి వైవిధ్యాన్ని ప్రతిబింబించే అనేక రకాల వనాలు

ఈ నగరవనం కుటుంబ సమేతంగా సందర్శించడానికి, విద్యార్థులకు ప్రకృతి గురించి అవగాహన పెంపొందించడానికి, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించడానికి ఒక ఉత్తమ కేంద్రంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.జిల్లా అటవీ అధికారి రాజశేఖర్ బాబు సూచనలు, మార్గదర్శకత్వంలో బద్వేల్ నగరవనం అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయబడింది. ప్రజలందరూ ఈ వనాన్ని సందర్శించి పరిశుభ్రతను పాటిస్తూ, మొక్కలను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ నగరవనం రూపుదిద్దుకోవడంలో మాజీ జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్(ఐ.యఫ్.ఎస్) దూరదృష్టి, ప్రణాళికాబద్ధమైన మార్గదర్శకత్వం, నిరంతర పర్యవేక్షణ, కృషి, అంకితభావం మరియు క్షేత్రస్థాయి కృషి విశేషంగా నిలిచాయని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. వీరి కృషి ఫలితంగానే బద్వేల్ నగరవనం నేడు ప్రజలకు అందుబాటులోకి వచ్చి బద్వేల్ పట్టణానికి ఒక ప్రత్యేక పర్యాటక, పర్యావరణ ఆకర్షణగా నిలిచిందని పేర్కొన్నారు.జిల్లా అటవీ అధికారి రాజశేఖర్ బాబు నాయకత్వంలో నగరవనం మరింత అభివృద్ధి చెందుతూ ప్రజలకు అత్యుత్తమ సౌకర్యాలు అందించేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంల బద్వేల్ యఫ్.ఆర్. ఓ నయూమ్ అలీ, మరియు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రకృతిని ప్రేమిద్దాం... పచ్చదనాన్ని పరిరక్షిద్దాం... బద్వేల్ నగరవనాన్ని సందర్శించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది.

# చెరుకూరి రవికుమార్ నాయుడు మరియు తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఘనంగా సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు



**పోరుమామిళ్ల,జూలై01.అక్షర టైమ్స్:-** పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ కమ్మవారిపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయం కడప జిల్లా డీసీసీబీ బ్యాంకు చైర్మన్, బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలను బద్వేల్ యువ నాయకులు చెరుకూరి రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, సూర్యనారాయణ రెడ్డి దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, కలవకూరి నడిపి వెంకటసుబ్బయ్య,కలవకూరి చిన్నవెంకట సుబ్బయ్యా, చెరుకూరి చెంద్రాయుడు, శ్రీరాములు,హిమంహుసేన్, చిట్టిబోయిన కోనయ్య యాదవ్,పాల పుల్లయ్య,రాళ్ళపల్లి గిరి,గాజులపల్లి రవి కుమార్, నరసయ్య , రహంతుల్లా,భాష,బాల చంద్ర,సత్యరాజు, బాలిరెడ్డి, కొత్త కోట జూఖిఎం చైర్మన్ దుగ్గిరెడ్డి,బాలుడు,అతిశెట్టి నాగేంద్ర, నాగేశ్వరావు, మల్లికార్జున, అత్తి కాయల రాజా, చెన్ను రమణ, పుల్లయ్య,పెట్లు రామయ్య,కృష్ణ రెడ్డి,చల్లగిరిగేళ్ల శ్రీనివాసుల రెడ్డి, గుర్రయ్యా ,కామనూరి శ్రీను,రామలక్ష్మయ,రఘు రామిరెడ్డి,మేకల వెంకట రమణ, సూర్యనారాయణ,గంట సుబ్బయ్యా,దాసరి వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, అంబవరము వెంకట కృష్ణ రెడ్డి, మల్లి కార్జున రెడ్డి,బలరామిరెడ్డి, వెంకటస్వామి రెడ్డి,కృష్ణారెడ్డి, రమణయ్య , భాస్కర్,నారాయణ,చంద్రమోహన్ రెడ్డి, రోశయ్య,గోపాల్ కృష్ణ పగిడి సందీప్ సాయి, శేఖర్, కేశవ,అన్నపురెడ్డి వెంకటసుబ్బయ్య, పుల్లారెడ్డి, నాయబ్, నరసింహ,షేక్ రఫీ, అజయ్,మాజీ కౌన్సిలర్ కృష్ణ యాదవ్ ,మంజు,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సూర్యనారాయణ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

## తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ అవినాష్ రెడ్డి కృషి

**ఎంపీ, మండల గ్రాంట్ కింద నిధులు మంజూరు**

**కొత్త తాగునీటి బోరు ఏర్పాటు**



**వేంపల్లె,జూలై01.అక్షర టైమ్స్:-** మండలంలోని నేలవరం తాండా ప్రాంతంలో తీవ్ర తాగునీటి సమస్య పరిష్కారానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కృషి చేశారని జడ్పీటిసి సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి వెల్లడించారు. ఎంపీ నిధుల కింద రూ.4 లక్షలు, మండల గ్రాంట్ కింద రూ.4 లక్షలు నిధులు మంజూరు చేయించి, కొత్త తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే నేలవరం తాండా, బోలగొంది చెరువు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి తలెత్తిందని, దీంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామ ప్రజలు స్థానిక జడ్పీటిసి మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ విషయాన్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి దృష్టికి రవికుమార్ రెడ్డి తీసుకెళ్లారు. ఎంపీ తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ఆ గ్రామ ప్రజలు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, ఎంపీటీసీ శివశంకర్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎస్ఐఆర్ పక్రియపై పలు దిశా నిర్దేశాలు

**బిఎల్ఓ లతో కలిసి ఆయా వార్డుల్లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి**



**వేంపల్లె,జూలై01.అక్షర టైమ్స్:-** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా విశ్రాంత తహసీల్దార్ శ్రీనివాసులు పలు దిశా నిర్దేశాలు సూచించారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో బూత్ కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బిఎల్ఓ లతో కలిసి ఆయా వార్డుల్లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలని, ఎన్యుమరేషన్ పత్రాలు పూర్తి వివరాలతో నమోదు చేసి..మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అర్హత కలిగిన ఉన్న ఓటర్ల పేర్లు చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. ఎస్ఐఆర్ పక్రియ పూర్తి అయ్యే వరకు బూత్ కమిటీ సభ్యులు ఓటర్లకు అందుబాటులో ఉండాలని సూచనలు చేశారు. అలాగే మ్యాపింగ్ ప్రక్రియపై బిఎల్ఓ లకు బూత్ కమిటీ సభ్యులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షులు మునీర్, రవిశంకర్ గౌడ్, నాయకులు రామచంద్రారెడ్డి తదితర బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై మంత్రికి వినతి

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**



**వేంపల్లె,జూలై01.అక్షర టైమ్స్:-** వేంపల్లె వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతి అందించారు. బుధవారం బీజేపీ నేతలతో కలిసి ప్రొద్దుటూరులో మంత్రిని కలిసిన ఆయన వేంపల్లె ఆసుపత్రికి సంబంధించిన సమస్యలను వివరించారు. వేంపల్లె ఆసుపత్రి ఐదు మండలాలకు కేంద్రంగా ఉందని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల అభివృద్ధి, సిబ్బంది అందుబాటు, 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేయడం వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బద్వేల్ లో సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు





**బద్వేల్,జులై01.అక్షర టైమ్స్:-** తెలుగు దేశం పార్టీ నాయకులు అరవ శ్రీనివాసుల రెడ్డి, పల్లె రమేష్ రెడ్డి, ఉప్పతి గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బద్వేల్ పట్టణంలో ఎన్జీవో కాలనీలోని సూర్యనారాయణ రెడ్డి నివాసం వద్ద భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బద్వేల్ పట్టణంలో సూర్యనారాయణ రెడ్డి జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీలు ఏర్పాటు పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.అరవ శ్రీనివాసుల రెడ్డి, పల్లె రమేష్ రెడ్డి, ఉప్పతి గంగాధర్ రెడ్డి లు సూర్యనారాయణ రెడ్డి ని భారీ గజమాల తో సత్కరించారు.ఆయన నివాసానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు, ప్రముఖులు పెద్దఎత్తున తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.తనకు శుభాకాంక్షలు చెప్పి ఆశీర్వదించడానికి వచ్చిన పెద్దలు అందరితో ఆప్యాయంగా పలుకరించి సూర్యనారాయణ రెడ్డి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

## కలుషితమైన నీరు త్రాగి శరీరం అంత దురదలు వస్తున్నాయని నరసన్న పల్లె మహిళల ఆవేదన

### అధికారులకు తెలియపరిచిన స్పందించని వైనం





**బ్రహ్మంగారిమఠం,జులై01.అక్షర టైమ్స్:-** బ్రహ్మంగారిమఠం మండలం నరసన్న పల్లి గ్రామంలో మంచి నీటి బోరు పైపు బొక్కబడి నీరు కలుషితం అవుతుందని అధికారులకు చాలా సార్లు తెలియజేసినప్పటికీ వచ్చి చూసి పైన పైన మట్టి తొలి పుడుస్తున్నారు కానీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని నరసన్న పల్లె గ్రామ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నరసన్న పల్లె సచివాలయానికి అతి దగ్గరలో ఉన్నటువంటి ఈ బోరు ఎస్టీ కాలనీవాసులు తాగుటకు కూడా వీటిని వినియోగిస్తున్నారు కానీ ఆ బోర్ నుండి వచ్చే వాటరు చానా అపరిశుభ్రంగా మరియు ఆ పరిసర ప్రాంతం అంతా కలుస్తమైన నీటితో ఈ బోర్ వాటర్ కలిసి రావడం వలన ఆ బోరు చుట్టుపక్కల వారు తాగి శరీరం అంతా దురదలతో వ్యాధుల బారిన పడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వచ్చేది వర్షా కాలం కాబట్టి ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు. అధికారులకు ఇదివరకు చెప్పినా కూడా మా సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తారని మీడియా ముఖంగా తెలియజేశారు.

## జమ్మలమడుగులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అడ్డు కోవడం దారుణం: ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి




**బద్వేల్,జూలై01.అక్షర టైమ్స్:-** పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి (జగనన్న) ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన, జమ్మలమడుగు నియోజకవర్గ సమన్వయకర్త ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జమ్మలమడుగు పార్టీ కార్యాలయం నుండి జె.ఎస్.డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ సందర్శనకు బయలుదేరిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి సాయిరాం థియేటర్ సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనూ, జగనన్న ప్రభుత్వ హయాంలోనూ జె.ఎస్.డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అంజాద్ బాషా , శైలజానాథ్ , మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి , రఘురామిరెడ్డి , ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ , ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి , రామచంద్రారెడ్డి , మాజీ ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి , ఎస్ఈసీ సభ్యులు గిరిధర్ రెడ్డి , కడప మేయర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిధులలో చేతివాటం చూపుతున్న మున్సిపాలిటీ ఆనందపై చర్యలు తీసుకోవాలి




**నందవరం,జులై01.అక్షర టైమ్స్:-** నందవరంలో అక్రమాలకు పాల్పడుతూ చేతివాటం చూపుతున్న మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఆనంద పై వెంటనే చర్యలు తీసుకోవాలి మునిసిపాలిటీ లో పని చేసినటువంటి జీతాలపై విడుదల చేసిన నిధులలో చేతివాటం చూపుతున్న ఆనంద పై చర్యలు తీసుకోవాలని తోటి వర్కర్లు తెలిపారు.ఈ నిధులు విడుదలైనప్పటికీ ఈ నిధులను పూర్తిగా తోటి పని చేసినటువంటి వర్కర్లకు అందించకుండా మున్సిపాలిటీలో పనిచేసేటువంటి ఐదు మందిని బెదిరించి మీరు ప్రతిరోజు పని చేయకున్న చేసినట్టు చెప్పి ఆరు నెలలకు ఒక్కసారి రూ.10,000 నిధులను విడుదల చేసినట్లు తెలిపారు.పడే జీతాలను ప్రతి నెల నెల నేను మీ జీతాలు సార్ వాళ్ళతో మాట్లాడి దగ్గరుండి పెట్టిస్తున్నాను ఆయనతో పాటు పనిచేసినటువంటి మీరు పని చేస్తే చేయండి లేదంటే ఇకనుంచి వెళ్లిపోండి అంటూ వారిపై అసభ్యకరంగా మాట్లాడడం వారిని భయపెట్టడం ఈ నిధులను వారికి పూర్తిగా అందించకుండా కేవలం రూ.8,000 మాత్రమే ఇచ్చినట్లు ఆరోపించారు. ఈ విషయం బయటకు వెల్లడిస్తే పని నుండి తొలగిస్తామంటూ హెచ్చరిస్తూ భయభ్రాంతులకు గురిచేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ విధంగా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ కళంకం తెచ్చిన ఆనంద పై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా విడుదల చేసిన పూర్తి మొత్తాన్ని పనిచేసేవారి చేతికి అందించేలా చర్యలు తీసుకోవాలని, ఆయనపై శాఖపరమైన కఠినమైన చర్యలు తీసుకుని, ఆయనను విధులనుండి తొలగించాలని కోరారు.

## ఆర్య వైశ్య సభ లీగల్ సెల్ చైర్మన్ గా సివి.సురేష్



**ప్రొద్దుటూరు,జూలై01.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహా ఆర్యవైశ్య సభ లీగల్ సెల్ కమిటీ చైర్మన్ గా ప్రొద్దుటూరు కు చెందిన ప్రముఖ న్యాయవాది, మాజీ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్, ఆర్యవైశ్య సభ కమిటీ మెంబర్ అయిన సి.వి సురేష్ రాష్ట్ర ఆర్యవైశ్య సభ లీగల్ సెల్ చైర్మన్ గా ఎంపికయ్యారు ఈ సందర్భంగా సివి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర మహా ఆర్యవైశ్య సభ తన మీద పెట్టిన ఈ బాధ్యతను తన వంతు కర్తవ్యంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఆర్యవైశ మహా సభ అధ్యశులు ఇల్లూరు లక్ష్మయ్య, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ కు ధన్యవాదాలు తెలిపారు, ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య సభ్యులు ప్రముఖులు సివి సురేష్ ను అభినందించారు.

# కర్నూలు జిల్లాలో ఫుడ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు







### అంగన్వాడిలు,రేషన్ షాపులో అక్రమాల వెలికితీత

### నాణ్యతలో లోపాలు, స్టాక్ వ్యత్యాసాలపై ఫుడ్ కమిషనర్ అగ్రహం

### అధికారులకు కఠిన చర్యలు ఆదేశాలు

**ఆదోని,జూలై01.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషనర్ విజయ ప్రతాపరెడ్డి పిడియాస్/ ఎండిఎం / ఐసిడిఎస్/ పి ఎం ఎం వి వై మరియు ఇతర సంక్షేమ పథకాల అమలను తనిఖీ చేయడానికి రెండు రోజులు పర్యటన నిమిత్తం లో భాగంగా కర్నూలు జిల్లాగూడూరు మండలంలోని గుడిపాడ అంగన్వాడి కేంద్రం మరియు గూడూరులో జూనియర్ కళాశాలను తనిఖీ చేయడమైనది. గుడిపాడు- 2 అంగన్వాడి కేంద్రంలో కోడిగుడ్లను పరిశీలించగా, వాటి బరువు నిర్దేశిత ప్రమాణాల కంటే తక్కువగా ఉన్నట్లు గుర్తించారు దీనిపై అంగన్వాడి నిర్వాహకులపై అగ్రహం వ్యక్తం చేసి,వెంటనే నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కోడిగుడ్లను సరఫరా చేయలేని చేయాలని ఆదేశించారు. తదనంతరం గూడూరు అంగనవాడి కేంద్రాన్ని తనిఖీ చేయగా, అంగన్వాడి కార్యకర్త హాజరు నమోదు సక్రమంగా నిర్వహించకపోవడం గమనించారు. ఈ నిర్లక్ష్యంపై సంబంధిత సూపర్వైజర్ల ద్వారా అంగన్వాడి కార్యకర్తకు సోకాజ్ నోటీస్ జారిచేయాలని ఆదేశించారు. అనంతరం రేషన్ షాపులను సందర్శించి కార్డుదారులతో మాట్లాడి పంపిణివ్యవస్థపై ఆర తీశారు మరియు డీలర్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.గూడూరు లోని ఐసిడిఎస్ సెంటర్ 3 ను తనిఖీ చేయగా,రికార్డుల ప్రకారం 343 కోడిగుడ్ల నిల్వలో ఉండవలసిన ఉండగా, కేవలం 43 కోడిగుడ్లు మాత్రమే ఉన్నట్లు గుర్తించబడింది. ఈ వ్యత్యాసంపై సంబంధిత అంగన్వాడీ కార్యకర్త మరియు సూపర్వైజర్లకు సోకాజ్ నోటీసులు జారీ చేయవలసిందిగా అధికారులకు ఆదేశించారు. తదనంతరం గూడూరు లోని రేషన్ షాప్ నెంబర్ 1 ను తనిఖీ చేయగా, స్టాక్ రికార్డుతో పోల్చితే 170 కిలోల బియ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించబడింది. దీనిపై సంబంధిత డీలర్ పై 6-ఏ కేసు నమోదు చేయడం జరిగింది. అనంతరం ఐసిడిఎస్ సెంటర్ (ఎస్ సి-1) తనిఖీ చేయగా,చిన్నారులకు అందిస్తున్న ఆహార నాణ్యత సంతృప్తికరంగా లేదని అలాగే రికార్డుల ప్రకారం ఉండవలసిన పరిమాణం కంటే కోడిగుడ్లు అధికంగా ఉన్నట్లు గుర్తించబడింది.గూడూర్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం మరియు గూడూర్ లోని జిల్లా పరిషత్ పాఠశాలను (బాలురుడ బాలికలు )లను తనిఖీ చేయడమైనది. మరియు అక్కడ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేయడమైనది.ఎమ్మిగనూర్ మండలం ఎం ఎల్ ఎస్ పాయింట్ ను తనిఖీ చేసి, నిల్వ పంపిణీ విధానాలను పరిశీలించడమైనది మరియు సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇవ్వడమైనది.ఆదోని మండలం ఆరెకల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానాన్ని పరిశీలించడ మైనది. తనిఖీలో సరుకుల నిల్వలో వ్యత్యాసాలు గుర్తించడం జరిగింది.కౌతాళం మండలం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం తనిఖీ చేయడం జరిగింది. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఉప్మా స్థానంలో ఎగ్ రైస్ అందించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీ వెంకట రాముడు, డిఎం సివిల్ సప్లయిస్ ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్, లీగల్ మెట్రాలజీఅధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్యం ఆహార భద్రత కీలకం

### విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..


### కౌతాళం కేజీబీవీ అకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి





**కౌతాళం,జూలై01.అక్షర టైమ్స్:-** మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం రోజున ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి అకస్మాత్తుగా తనిఖీలు చేయడం జరిగింది. రేషన్ షాపులను తనిఖీ చేయడం జరిగింది.ఈ తనిఖీల్లో భాగంగా కేజీబీవీ పాఠశాలను సందర్శించి వంటశాలలు,స్టోర్ రూమ్ లను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా రుచి చూసి,నిబంధనల ప్రకారం మెనూ ఉందా లేదా అని తనిఖీ చేశారు.విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంగా ఉంటేనే ఇష్టపడు చదువుకుంటారని, వారు శారీరిక మానసిక అభివృద్ధికి అవసరమైన సమతుల్య ఆహారం, ఆరోగ్య పరిరక్షణ అత్యంత ముఖ్యమని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి అన్నారు.అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిల్వ ఉన్న కూరగాయలు, పాడైపోయిన వస్తువులు లేదా నాణ్యత లేని నిత్యావసర సరుకులను గుర్తిస్తే నిర్వాహకులపై కఠిన చర్య తీసుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాప్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎం.రాజ రఘువీర్, సివిల్ సప్లై వెంకట్ రాముడు, ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్, మరియు లీగల్ మెట్రాలజీ అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్ మరియు ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డి, ఎంపీడీవో స్వర్ణలత, మండల విద్యాధికారి శోభారాణి, రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి యోగేశ్వర్ రెడ్డి, తదితరులు గ్రామ నాయకులు పాల్గొన్నారు.


# తొలి తెలంగాణ ఉద్యమ నేత



ఐదు దశాబ్దాల కిందట అనంతుల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో జరిగిన తొలి దశ ఉద్యమం గురించి నేటి తరానికి తెలియకపోవచ్చు. తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడిగా 1968-69లో ఆయన తొలి తెలంగాణ ఉద్యమాన్ని పరుగులు పెట్టించారనే విషయాన్ని నేటి యువత తెలుసుకోవాలి. మదన్ మోహన్ జయంతి సందర్భంగా ఆయన సేవలను తెలంగాణ గడ్డ స్మరించుకోవాలి. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాకకు చెందిన అనంతుల మదన్ మోహన్ 1932, నవంబర్ 16న జన్మించారు. మదన్ మోహన్ తండ్రి చక్రపాణి నిజాం హయాంలో కరీంనగర్ జిల్లాలో నాయబ్ తహశీల్దార్‌గా (డిప్యూటీ ఎమ్మార్వో) పనిచేశారు. కొండపాకలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన మదన్ మోహన్, వరంగల్‌లో మెట్రిక్యులేషన్, హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో డిగ్రీ, ఓయూలో ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. 1955-1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలయ్యేసరికి హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ సమకాలీన రాజకీయాలను అధ్యయనం చేస్తుండేవారు. అయితే, 1956 నవంబర్ 1న నాటి నెహ్రూ ప్రభుత్వం హైదరాబాద్ స్టేట్‌ను ఆంధ్ర రాష్ట్రంలో కలిపింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచీ తెలంగాణకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు నాటి సీమాంధ్ర పాలకులు. తెలంగాణ ప్రాంతం దోపిడీకి గురవడంతో తెలంగాణలో ఆందోళనలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మేధావులు, యువకులు, సామాజిక కార్యకర్తల నేతృత్వంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజాసమితి (టీపీఎస్) ఏర్పడింది. యువకుడు, విద్యావంతుడు, మేధావి, న్యాయవాది అయిన అనంతుల మదన్ మోహన్ టీపీఎస్‌కు వ్యవస్థాపక అధ్యక్షుడయ్యారు. ఏప్రిల్ 5న సికింద్రాబాద్‌లో రాష్ట్ర సమైక్యతను కోరుకుంటూనే తెలంగాణకు రక్షణ ఇవ్వాలని బహిరంగసభ నడిపిన కమ్యూనిస్టులకు, తెలంగాణవాదులకు (టీపీఎస్) మధ్య గొడవ జరిగింది. మదన్‌మోహన్‌తోపాటు నాటి విద్యార్థి జేఏసీ ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో తెలంగాణవాదుల అరెస్టుకు నిరసనగా ఏప్రిల్ 11న హైదరాబాద్‌లో సామూహిక సత్యాగ్రహం జరిగింది. మరోవైపు శాసనసభ్యుడిగా చెన్నారెడ్డి ఎన్నిక చెల్లదని, ఆయన ఆర్నెళ్ల పాటు పోటీ చేయకూడదని 1968 ఏప్రిల్ 26న హైకోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటికే మదన్‌మోహన్ అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమం సమర్థంగా నడుస్తున్నది. కానీ, ఆ ఉద్యమానికి చెన్నారెడ్డి నాయకత్వం వహించాలన్న ఒక వర్గం కుట్రల ఫలితంగా మదన్ మోహన్ టీపీఎస్ పగ్గాలను వదులుకున్నారు. 1969లో టీపీఎస్ నేతృత్వంలో ఉద్యమం ఉధృతం కాగా, పోలీసుల కాల్పుల్లో 369 మంది విద్యార్థులు చనిపోయారు. దీంతో ఉద్యమానికి తాత్కాలిక విరామం ప్రకటించాల్సి వచ్చింది. ఆ తర్వాత 1970లో జరిగిన ఉప ఎన్నికల్లో సిద్దిపేట నుంచి మదన్‌మోహన్ 20 వేల మెజారిటీతో, ఖైరతాబాద్ నుంచి నాగం కృష్ణారావు 15 వేల మెజారిటీతో గెలిచారు. ప్రత్యేక రాష్ట్రం సాధించగలమనే నమ్మకాన్ని టీపీఎస్‌కు ఈ విజయం అందించింది. ఆ తర్వాత మదన్‌మోహన్ 1971 నుంచి 1985 వరకు వరుస గా సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. పీవీ నరసింహారావు, చెన్నారెడ్డి, భవనం వెంకట్రామ్, టి.అం జయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డిల హయాంలో మద న్ మోహన్ వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించా రు.

మదన్ మోహన్ ఉన్నత సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్‌లో జేఎన్‌టీయూ స్థాపితమైంది. ఆయన ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న కాలంలోనే ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పీహెచ్‌సీలు) ఏర్పడ్డాయి. అంతేకాదు, దాదాపు 10 నుంచి 12 వేల మందికి ఆయన వివిధ శాఖల్లో కొలువులు ఇప్పించారు. సిద్దిపేటలో 220 కేవీ సబ్‌స్టేషన్, టీవీ రిలే స్టేష న్, నెహ్రూ యువ కేంద్రాలు, మిల్క్ చిల్లీ సెంటర్, ఇందిరా మహిళా డిగ్రీ కాలేజీలను ఆయన ఏర్పాటు చేశారని సిద్దిపేట ప్రాంతవాసులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటారు. కొండాపూర్ పీహెచ్‌సీకి తన తండ్రి స్మారకంగా రెండెకరాల భూమిని ఆయన విరాళంగా ఇచ్చా రు. 1990లో ఏపీ పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ గా, 1989లో పీసీసీ జనరల్ సెక్రెటరీగా, ఏఐసీసీ మెంబర్‌గా (శాశ్వత ఆహ్వానితుడిగా) సేవలందించా రు. 1994లో చివరిసారిగా ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 1998లో కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర స్టేట్ ఇంచార్జిగా పనిచేశారు. రాజకీయాల్లో ఉన్నత విలువలు పాటించిన మదన్‌మోహన్ 2004, నవంబర్ 1న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఒక మహోజ్వల ఘట్టం. ఆ పోరాటంలో 369 మంది యువకులు, తొలి తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో క్రియాశీల నాయకుడైన మదన్ మోహన్ నిత్య స్మరణీయులు. నాడు ఉద్యమాన్ని నడిపించిన నేతలు, యువకులు, విద్యార్థులే ఆ తర్వాతి కాలంలో దేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. ఆ పోరాటం భవిష్యత్తు కొనసాగింపునకు, స్వరాష్ట్ర కల సాకారమయ్యేందుకు భూమికగా నిలిచింది. అది విస్మృత చరిత్ర కాదు. ఆ చరిత్రను నేడు మనందరం మననం చేసుకోవాలి. (మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా తొలి తెలంగాణ ఉద్యమ నేత మదన్ మోహన్ విగ్రహావిష్కరణ నేడు జరుగుతున్న సందర్భంగా..)

## పెద్ద పేగులో ఉండే వ్యర్థాలను సులభంగా ఇలా బయటకు పంపండి ఈ ఆహారాలను రోజూ తీసుకోండి



మనం తినే ఆహారాలు లేదా తాగే ద్రవాలు ఏవైనా సరే ముందుగా జీర్ణాశయంలో జీర్ణం అవుతాయి. అనంతరం అక్కడి నుంచి ఆహారం చిన్న పేగులకు చేరుతుంది. చిన్న పేగుల్లో ఆహారంలో ఉండే పోషకాలను శరీరం శోషించుకుంటుంది. అక్కడ పోషకాలు పోగా మిగిలిన ఆహారం మలంగా మారుతుంది. అనంతరం అక్కడి నుంచి ఆ మలం పెద్ద పేగు ద్వారా బయటకు వస్తుంది. ఇలా జీర్ణ వ్యవస్థ పనిచేస్తుంది. అయితే ఆహార వ్యర్థాలను బయటకు పంపే పెద్ద పేగు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలి. అందులో ఎలాంటి వ్యర్థాలు పేరుకుపోకూడదు. అలా పేరుకుపోతే మనకు అనేక వ్యాధులు వస్తాయి. పెద్ద పేగులో వ్యర్థాలు పేరుకుపోతే శరీరం విష తుల్యంగా మారుతుంది. దీంతో అనేక రోగాల బారిన పడాల్సి వస్తుంది. కనుక పెద్ద పేగును ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలి. అందుకు గాను పలు ఆహారాలు మనకు ఎంతో దోహదం చేస్తాయి. వాటిని రోజూ తీసుకుంటే పెద్ద పేగును ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

**ఫైబర్..**

పెద్ద పేగు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉండాలంటే ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. ఫైబర్ వల్ల మలం గట్టిగా మారకుండా ఉంటుంది. దీంతో అది పెద్ద పేగు నుంచి సులభంగా బయటకు వస్తుంది. కనుక పెద్ద పేగు ఆరోగ్యం కోసం ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఫైబర్ మనకు తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతోపాటు ఓట్స్, పప్పు దినుసులు, శనగలు, బార్లీ వంటి ఆహారాల్లో లభిస్తుంది. కనుక వీటిని రోజూ తీసుకోవాలి. బ్రౌన్ రైస్, బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్, అవిసె గింజలను తింటున్నా కూడా ఫైబర్‌ను పొందవచ్చు. అలాగే ప్రో బయోటిక్ ఆహారాలను తీసుకుంటుంటే పెద్ద పేగుకు ఎంతో మేలు జరుగుతుంది.